# పాడుకల

బలివాడ కాంతారావు

ఇది పాడుకల. ఇదివరకు మా చిన్నాన్న నాలుగుసార్లు కలలో కనిపించారుకానీ యీసారిలా కలలో నాతో మాటాడలేదు. అతని భార్యా, పిల్లలున్నా, చచ్చి ఐదేళ్ళయినా వాళ్ళకి కలలోనలీలగానైనా కనిపించనివాడు నాకే యెందుకు కనిపించాలని నా పెళ్ళాం యిదివరకు విసవిసలాడిందంటే కారణం లేకపోలేదు. చచ్చినవాళ్ళు కలలోరావటం కలగన్నవాళ్ళకి మంచిది కాదట. అతను పల్లెటూర్లో గతించినా పట్నంలో కొన్నేళ్ళున్నాడు. అప్పుడు నేను వాళ్ళింట్లో చదువుకునేవాడ్ని. నాకే కొన్ని నమ్మకమైన పనులు అప్పచెప్పేవాడు. నేను యేదైనా రహస్యంగా వుంచుతానని ఆయనకు నమ్మకం కుదిరివుంటుంది.

ఈ పాడుకల యించుమించు వేకువఝామున వచ్చింది కాబట్టి దీని ఫలితం త్వరలో తెలుస్తుందంటారు. చిక్కేమిటంటే కలలో మా చిన్నాన్న వీరాస్వామి నాతో మాటాడటం వలన అతని మాటల్లోని చిక్కును తెలివివచ్చి యెంత ఆలోచించినా పరిష్కారం చెయ్యలేక తికమకపడుతుంటే మా ఆవిడ సగం కళ్ళు తెరచి చూసి —


"మళ్ళీ కలలో కనిపించారా మీ చిన్నాన్న?" అని వెగటుగా ప్రశ్నించింది.

"కనిపించడమేకాదు - నాతో మాట్లాడేడుకూడాను" అనుకోకుండా అనేసి - యిలా నోరు జారేసి యెంత పొరపాటు చేసానని లోలోపల నొచ్చుకుంటుంటే -

"ఇదేమిటీన్యాయం? చచ్చినవాడు మీతో మాటలేమిటి? ఇంతకీ యేం అన్నారు?" అంటూ లేచిపోయింది.

కల చెప్పితేగానీ వదలనని మాఆవిడ నన్ను పీకి పట్టు పట్టడంవలన కల చెప్పక విధిలేక పోయింది.

"ఏటిఒడ్డున పొదలు కనిపిస్తున్నాయ్. ఒంటరిగా నేను వెళ్తున్నాను. ఆ పొదల మధ్యలో ఒక పొడుగాటి పాతిన కర్రకు ఒక దిష్టిబొమ్మ కట్టివుంది. తెల్లనిషర్టు మీద నల్లని కోటు. నేను చూస్తుండగానే ఆ దిష్టిబొమ్మ కదలి వయసులో మా చిన్నాన్న ఉంగరాల జుత్తుతో యెలా హుషారుగా కదిలేవాడో అలాగే నావేపు



కదలి వచ్చి నా యెదరగా నిల్చొని అన్నాడు. "నిన్ను నమ్మినందుకు నాకు తోడు నీడగా ఆరుగుర్ని పంపించావురా! అంతేచాలు..." అంటూ సంతోషంతో పక పక నవ్వుతుండగా చప్పున తెలివి వచ్చేసింది. తెలివి రాకపోతే అతను బతికున్న రోజుల్లో సంతోషంగా నవ్వినప్పుడు గట్టిగా యెదరగా వున్న మనిషిని ఆలింగనం చేసే అలవాటు కలలో కూడా తప్పక పోయేదేమో?

ఈ భల్లూకవు పట్టునించి బతికానను కుని యింతకీ ఆ వచ్చిన ఆరుగురెవరని ఆలోచనలో పడగా అతను చనిపోయిన తరువాత మా కుటుంబాలలో చనిపోయిన వాళ్ళు ఐదుగురే దొరికారు లెక్కకు. అంచేత ఆరోమనిషెవరని మా ఆవిడ

ఆలోచనలనుకూడా ఈ చిక్కుని పరిష్కరించడానికి ప్రవేశ పెట్టక తప్పలేదు. మా ఆవిడ లెఖ్ఖ మొదలుపెట్టింది.

"మీ నాన్నా – మా నాన్నా గుండె పోటుతో పోయారు. మా చిన్నాన్నలిద్దరిలో ఒకాయన నెలరోజులు మంచంమీద వుండిపోతే యింకోకాయన మూడేళ్ళు ముడుకులు పడిపోయి జబ్బుతో నానా అవస్థపడిపోయాడు. అతని మేనల్లుడు స్కూటర్ యేక్సిడెంటులో పోయాడుకదా అంతే –"

మళ్ళీ మళ్ళీ లెఖ్ఖ వేసినా ఐదుగురే తేలింది.

"అయ్యబాబోయ్ – ఆరోచావుకబురు యేక్షణంలో వింటామో ?" భయంతో ఆమె అన్నా, మా బంధువుల్లో యెవరు అనారోగ్యంగా వున్నారాని యిద్దరం పర్యావలోకనం చేసాం. ఎవరూ మా వూహలకు దొరకలేదు. ముసలాళ్ళెవరైనా వున్నారా అంటే వున్న యిద్దరూ వయసుతో వున్నవాళ్ళకన్నా ఆరోగ్యంగా వున్నారు. చావు యెవరు చెప్పగలరు ? బస్సు ఫుట్‌బోర్డుమీద ప్రయాణం చేస్తే, స్కూటర్‌మీద స్పీడుగాపోతే, రైల్లో నిద్రపోతుండగాకూడా యీ కలికాలంలో యేక్సిడెంట్లు తప్పించుకోలేక పోతున్నాం కదా ! ఇలా కల వచ్చిందన్న వైనం యెవరికీ చెప్పకూడదనుకున్నా యిది మా కుటుంబాల్లో బాష్పవాయువులా అల్లుకుపోయింది. స్కూటర్లు వున్నవాళ్ళు ఎంతో అవసరం అయితేగాని వాహనాలను బయటకు తీయటంలేదు. ప్రయాణాలు విధిలేక చేస్తున్నారు. ఎవరికైనా రొంపచేసినా డాక్టరును చూస్తున్నారు. ఇలా రోజులు నెలలుగడచినా అనుకున్న అఘాయిత్యం యేమీ జరగలేదు. చివరకు నా కలమీద వ్యాఖ్యానాలు నా చెవిలోనే పడ్డాయి.

"సరిగ్గా వినలేదు కామోసు. బహుశ ఐదుగురన్నది ఆరని విన్నాడేమో పొరపాటున ?"

"కలలో చచ్చినవాడు మాటలాడాడంటే నమ్మగలమా ?

"కన్నకొడుకులూ, పెళ్ళాం వుండగా వీడికెందుకు కనిపిస్తాడు ?"


"అసలు కలంటూ కన్నాడా ?"

"అందరికీ భయపెట్టడానికి ఈ జోక్ వదిలాడు. మనమంతా ఫూల్స్‌లా నమ్మాం."

ఇంత రాద్ధాంతం జరిగాక నామాట అబద్ధంకాదు. నాకల నిజం అని నిరూపించుకోవల్సిన బాధ్యత నానెత్తినేపడింది. నిరూపించడానికి నాకున్నసాక్ష్యంయేదీ ? అసలు మా ఆవిడనించే యీ గొడవంతా జరిగింది. ఈ విషయం దాచుకోకుండా టామ్‌టామ్ చేసిందెందుకు ? నిజం చెప్పినందుకు నామీదే మావాళ్ళంతా రాళ్ళు రువ్వుతున్నారనిపించింది. ఏంచెయ్యడం? నాకు కనిపించినట్లే వాళ్ళావిడకూ కలలో కనిపించి నాతో అన్నట్లే అనకూడదూ ? అలా కనిపించి చెప్పమని చచ్చిన చిన్నాన్నకు మొక్కుకున్నా ఏమీ జరగలేదు. మా కుటుంబాలలో యే ముసలాడు పోయినా నామీద రుద్దిన అసత్యపువాదు పోదు ...

ఆ ఆరోవాడెవడు ? తోడుగా మగాళ్లే వుండాలని లేదుగా ! ఆడమనిషివుండొచ్చుగా ! చప్పున నాకు గుర్తు వచ్చింది. పట్నంలో వున్నప్పుడు మా చిన్నాన్న






నన్ను అప్పుడప్పుడు రహస్యంగా ఒక యింటికి పంపించేవాడు. జిలేబీలో, పకోడీ పొట్లాలో, ఒకోసారి సంపంగి పూలదండో నాతో ఆ యింటికి పంపించేవాడు. ఆ సత్తియ్యమ్మ బజారులో కూరగాయలు కూడా అమ్మేది. ఆ రోజుల్లో పయ్యారంగా చీరచుట్టుకున్న దొరసానిలా వుండేది. వయసులో వున్నానికి పూజలావున్నది వయసు ముదిరాక అమావాస్యకు ఆరగింపయిన తేనెపట్టులా మారింది. ఆ ఆరోది ఆవిడ కాకూడదా అని ఆ యింటికి వెళ్ళాను. కనుక్కుంటే తేలింది సత్తియ్యమ్మ పోయి పదేళ్ళయిందట !

నిరాశతో రోజుల తరబడి ఆలోచనలో పడ్డాను. మంచివార్త, మంచి నడవడిక, బ్రతుకు తెరువు, అంతా మంచిని కాంక్షించే మనుషులు చెడుగును వినలేరు, సహించలేరు. పుట్టుక ఆనందం, చావు భయం. చావు పుట్టుకలున్నంతకాలం మంచికలలతో పాటు పాడు కలలూ వుంటాయి. కానీ యికముందు పాడుకల యెప్పుడూ బయటకు పొక్కనివ్వకుండా వుంచాలనే నిర్ధారణకు వచ్చాను.

ఇంతలో నాకో అపవాదు వచ్చింది. మా చిన్నాన్న భార్య మంగళగౌరి మంచం పట్టింది. ఒక్కనాడు ముక్కుచీది యెరగని మనిషి యిలా మంచం పట్టిందంటే మనసులో పుండులా పెరిగిన బెంగకాక మరేమిటన్నారు. ఆవిడకుబాగుకావాలంటే నేను వెళ్ళి ఆవిడతో చెప్పాలి.

"ఆవేళ తప్పు చెప్పాను. ఆరుగురు కాదు ఐదుగురే" అని చెప్పాలట.

ఈ అబద్ధం చెప్పి ఆవిడ ప్రాణం రక్షించండని మా ఆవిడకూడా ఒత్తిడి చేసింది.

"ఇప్పటివరకు సత్యహరిశ్చంద్రుడిలా తెచ్చుకున్న పేరును అబద్ధంఆడి పురితీసేమంటావా ?" అని కోపం తెచ్చుకున్నాను.

"కల నిజం కాదుకదా ! అలాంటప్పుడు కలమీద మీ అబద్ధం అబద్ధం యెలా అవుతుందిలెండి. వెళ్ళండి."

"ఇలాచెప్తే అసలు నా మాటంటేనే నమ్మకం పోతుందికదా ! నేను ఆరును

ఐదుగా యెంతమాత్రం మార్చను" అని భీష్మించి కూర్చున్నాను.

"కలగన్న మీరు మార్చక ఇంకెవరు మారిస్తే నమ్ముతారు ?"

"ఆ చచ్చినవాడికి పెళ్ళాంమీదఅంత మమకారంవుంటే ఆవిడ కలలో కనబడి ఆరుని ఐదు చెయ్యమని మొక్కు !" అన్నాను కోపంగా.

ఎంత నచ్చచెప్పినా అబద్ధం ఆడడానికి ఒప్పుకోక పోవటంతో "పోనీ వెళ్ళి ఆవిడకి కాస్త ధైర్యం చెప్పండి. కలలు నిజమైపోతాయా ఇంతకీ అతనేమన్నాడు? ఆరుగురుని తోడుగా పంపించావన్నాడు గానీ ఐదుగుర్ని పంపించావు, ఆరోవాడ్ని కూడా పంపమని అనలేదుగా - ఏదో పొరపాటు జరిగి వుంటుంది."

"పొరపాటా?"

"ఈ చచ్చిన ఐదుగురితో అతనెప్పుడూ జగడం ఆడలేదు. వాళ్ళంటే యిష్టపడేవాడటగా! తోడుగా పంపించారన్నారే - అతనంటే యిష్టపడ్డవాళ్ళనే తోడుగా వుంచుకుంటారుగానీ, ఆవిడెందుకు వుంచుకుంటాడు ?"

"ఎప్పుడూ యింట్లో పోట్లాటేకదా! అతను జీవించినంతకాలం యీ పెళ్ళాన్ని కాల్చుకతిన్నాడు. మీ వన్నది నిజమే. ఆరోవ్యక్తి యీవిడెల్లా అవుతుంది ?"

"అంచేత యెలాగో ఒకలాగ ఆవిడకి ధైర్యం చెప్పించి బతికిస్తే మనకొచ్చిన అపవాదు పోతుందని" ఆవిడ ప్రాధేయపడడం వలన బయలుదేరి మా పిన్ని వున్న గ్రామం వెళ్ళాను.

మా పిన్ని మంచంమీద నీరసంగా పడివుంది. మందులు తినటం మానేసిందట. ఆహారం తగ్గించేసిందట. నన్ను చూసాక కొంతసేపటికి దగ్గరగా రమ్మని మెల్లగా -

"నీ కల నిజం అవుతోంది నాయనా"

"ఇదేమిటి పిన్నీ - మీ అమ్మ ఎనభైయ్యేళ్ళు, మీఅత్త ఎనభైఐదేళ్ళు బ్రతికింది. మీరు యింకా డెబ్భయి మూడులోనే వున్నారుకదా జబ్బు సారం వస్తుంది అంటారు. మీకేంకాదు" అన్నాను.

"నేనూ అలాగే అనుకున్నాను. చచ్చిన మనిషికి దేవుడి అంశ వస్తుంది, ముందుకు జరగబోయేది చెప్పగలరు"

"అదేంటి పిన్నీ అలా అంటావు? చిన్నాన్న పోయాక ఒక పెద్ద జ్యోతిష్యుడు నువ్వు రెండేళ్ళకే చచ్చిపోతావన్ని చెప్పినా బెంగపెట్టుకుని మంచం యెక్కలేదు. అలాంటిది నా కలతో యింతగా మనస్సు జార్చేసావేమిటి ?"

"మా అందరికీ కాదని నీ కలలో వచ్చి యెందుకు చెప్పారు ? నువ్వంటే యిష్టం, అబద్ధం యెరుగని వాడివని"

"ఆ ఆరోమనిషి నువ్వని అనలేదుకదా! నువ్విలా తిండి మానేసి నీరసించావంటే యింకేదో కారణంవుంటుంది" మెల్లగా చెవి దగ్గర "కొడుకులూ - కోడళ్ళూ తిట్టున్నారా - కొట్టున్నారా ?"

"అబ్బే ... అబ్బే - లేదురా ..."

"అయితే - యిదిగో నీకిష్టమైన బన్ను రొట్టెలు తెచ్చాను. తింటేగానీ వీల్లేదని" గబగబ సంచిలోని ఒక బన్ను తీసి ఒక ముక్కను చిదిమి ఆమెనోటిలో కుక్కాను. ఈ బలవంతంతో కొద్దిగా తిని మంచినీరు అడిగింది. ఎంగిలి పడ్డ సగం ముక్క వాళ్ళ కుక్కకు వేద్దామని ....

"చిన్నాన్న నల్లని జూలు కుక్క పిల్లని పెంచేవారు ఏదదీ ?"

కాస్త కదలి దిండుని ఆనుకుని కూర్చొని

"అదా ! అతను పోయాక నెల రోజుల్లోనే బెంగపెట్టుకుని చచ్చింది."

నేను చప్పున ఒక గెంతు గెంతి "ఇప్పుడు ఆరోదితెల్సింది-గుర్తువచ్చింది ఆ కొయ్యదగ్గర ఒక నల్లని బొచ్చుకుక్క పడుకునివుంది. అది అరిచివుంటే బాగా గుర్తున్ను" అని అబద్ధం ఆడాను.

"ఆయన బ్రతికుండగా అంతగా అరిచేది. అతను పోగానే యింకో కుక్కను చూసైనా అరిచేదికాదు. మౌనరోగంతోనే చచ్చిపోయిందిరా."

"హమ్మయ్యా" అని "పిన్నీ-నాకల గురించి యిక మరచిపో" అని దగ్గరగా వెళ్ళాను. ఆవిడ మాటాడలేదు. తాగిన నీటిని కన్నీరుగా మార్చిన తలపులేమిటా అని ప్రక్కనే ఒంటరిగా కూర్చుంటే కొంతసేపటికి పొగనించి లావా బయట పడినట్లు ఆమె పరితాపం బయట పడింది.

"నాయనా! కలలో జరిగింది యిలలో జరగదన్న సామెత నాకు తెలుసురా! చచ్చిపోతానని బెంగ పెట్టుకోలేదు. నీ కలలో కనిపించి తోడూ - నీడా గురించి ఆయన అన్నదగ్గరనించీ నా మనస్సు కెలికి పెరికి యిప్పటికీ చిందర వందర చేస్తోందిరా..."

"బ్రతికుండగా నిన్ను కాల్చుక తిన్నాడు కదా - ఎందుకలా బాధపడిపోతావు పిన్నీ ?" అన్నాను సానుభూతితో.

"అయ్యో !" అంటూ నొసటిని తాకుకుంటూ "అగ్నిసాక్షిగా అతన్ని కట్టుకున్నదాన్ని - అతను బతికుండగా తోడూ నీడా కాలేకపోయాను."

"అదెలా ?"

"నా రుసరుసలతో పరస్త్రీల వద్దకు పరుగెత్తినట్లు చేసాను. అతన్ని పిల్లలు శత్రువులుగా చూసారంటే - కారణంనేనే. అతని తోడూ నీడకు దూరం చేసిన నా మొండిపట్టు అతన్ని తాగుడుకు దింపింది. నన్నుతిట్టీ, కొట్టీ మన చుట్టాలలో చెడ్డ పేరు తెచ్చుకున్నారు. అతనిని క్షమించి సేవచేసి, తోడుగా, నీడగా వుండలేకపోయానే అన్న బాధ యిప్పుడు చంపుకు తింటోంది. ఇప్పుడు చెయ్యాలన్నా చెయ్యగలనా ? అయ్యో ! ఏమీ చెయ్యలేని నా బతుకు అంతా ఒక 'పాడుకలే' అయిపోయిందికదా అని కుమిలి కుమిలి చివరకు యీ మంచం పట్టాను నాయనా" అని కన్నీరు తుడుచుకుంది.

తెలివేసివుండి ఒక పాడుకల కంటున్నాననిపించింది. ఈ కల గురించి ఇంకెవరికీ చెప్పకూడదని నిర్ధారించుకుని వెళ్ళిపోయాను.

